26న బహుమతుల ప్రదానం

జియాగూడ: ప్రతి సంవత్సరం లాగే ఈ సారి కూడా గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్వాన్ శివ శంకర క్రాంతి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కార్వాన్ క్రాంతిభవన్‌లో సమాజ సేవలందించిన జీహెచ్‌ఎంసీ ఇతర విభాగాల కార్మికులకు సన్మానం ఉంటుందని తెలిపారు. అలాగే సంక్రాంతి రంగోలీ పోటీల్లో గెలుపొందిన మహిళలకు, నేతాజీ జయంతి సందర్భంగా విద్యార్థులు పలు ఆటల పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి బహుమతుల ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం మొదలవుతుందని తెలిపారు.

ఢిల్లీ పరేడ్‌కు ఐపీజీడీసీడబ్ల్యూ విద్యార్థిని ఎంపిక



మీనాక్షిని అభినందిస్తున్న ఆచార్య చంద్రముఖర్జీ, ఉదయశ్రీ

నాంపల్లి: ఇందిరా ప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాలలో సైన్స్ కోర్సులో రెండవ సంవత్సరం చదువుతున్న సపావత్ మీనాక్షి ఎన్‌ఎస్‌ఎస్ తరపున ప్రత్యేక అతిథిగా ఎంపికై జనవరి 26న ఢిల్లీ రిపబ్లిక్ డే పరేడ్‌కు హాజరుకానుంది. ఈ సందర్భంగా మీనాక్షిని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య చంద్రముఖర్జీ, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఉదయశ్రీ ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



నిలోఫర్ ఆసుపత్రిలో..

నాంపల్లి: జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం నిలోఫర్ ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన ప్రసంగించారు. సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదలపై ప్రతి ఒక్కరూ అవగాహన పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఉషారాణి, ప్రొఫెసర్ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదం

అబిడ్స్: సైన్‌బోర్డులు తయారు చేసే ఫ్యాక్టరీకి ఆనుకుని ఉన్న గోదాంల్లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గుడిమల్కాపూర్ ఇన్‌స్పెక్టర్ రాజు, స్థానికుల కథనం ప్రకారం.. మొఘల్‌ఖానాలా సమీపంలో సైన్‌బోర్డులు తయారు చేసే ఫ్యాక్టరీ, అమ్మే దుకాణం, నిల్వ ఉండే గోదాంలున్నాయి. శుక్రవారం ఎవరూ లేని సమయంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ పలువురు మజ్లిస్ నాయకులు వచ్చి బాధితులను పరామర్శించారు. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగకపోవటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా ప్రార్థనలు



శాలిబండ: మక్కా మసీదులో శుక్రవారం సామూహిక ప్రార్థనలు ప్రశాంతంగా జరిగాయి. ఈ ప్రార్థనల్లో ముస్లింలతో పాటు మాజీ కార్పొరేటర్ మోసిన్ బలాలలు పాల్గొన్నారు. ప్రార్థనలను పురస్కరించుకొని దక్షిణ మండలం పోలీసుల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

సన్మానం



యాకుత్‌పురా: తెలంగాణ హైకోర్టు నూతన న్యాయమూర్తులుగా నియమితులైన హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి రేణుక యారా, సిటీ స్మాల్ కాసెస్ కోర్టు చీఫ్ జడ్జి నడికొండ నర్సింగ్ రావును సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పురానీహవేలీలోని కోర్టులో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. శ్రీనివాసాచారి, ప్రధాన కార్యదర్శి దుబ్బక హర్షవర్ధన్, ఉపాధ్యక్షురాలు కె.ప్రవీణారెడ్డి, సంయుక్తా కార్యదర్శి బర్క రాజేష్ కుమార్, లైబ్రరియన్ సుధంష్ కుమార్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కుస్తీమే సవాల్..!

- వన్నె తగ్గని ప్రాచీన క్రీడ
- పహిల్వాన్‌లుగా మారేందుకు యువత ఆసక్తి
- నేటి నుంచి బార్కాస్‌లో హైదరాబాద్ కేసరి రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌పోటీలు



కుస్తీ పడుతున్న పహిల్వాన్లు (ఫైల్)



దంగల్‌లో కుస్తీ పడుతున్న యువకులు

చాంద్రాయణగుట్ట: పాతబస్తీలోని బార్కాస్, సలాల, చాంద్రాయణగుట్ట, ఎర్రకుంట, కొత్తపేట ప్రాంతాలకు చెందిన యువత కుస్తీ క్రీడలకు ప్రాధాన్యమిస్తున్నారు. ఈ పరిసరాల్లో ఎటు చూసినా పహిల్వాన్లే దర్శనమిస్తుంటారు. డిగ్రీలు పూర్తి చేసిన వారు సైతం'సై'అంటుంటారు. పహిల్వాన్‌లుగా తయారుకావడానికి ప్రతిరోజు గంటల తరబడి దంగల్‌లలో శ్రమించేందుకు ఇష్టపడుతారు. బార్కాస్ ప్రాంతానికి చెందిన కాలేద్ బామస్, అబ్దుల్లా బిన్‌గౌస్, మహ్మద్ బిన్ గౌస్ ఆంధ్ర కేసరీ టైటిళ్లను సాధించి కుస్తీ పోటీలకు ఇంకా ప్రాధాన్యత తగ్గలేదని నిరూపించారు.

25 నుంచి హైదరాబాద్ కేసరి రెజ్లింగ్ చాంపియన్‌షిప్..

'బామస్ అఖాడా ప్రొఫెషనల్ రెజ్లింగ్ హబ్'ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి రెండు రోజుల పాటు 25 (సిల్వర్ జూబ్లీ)వ 'హైదరాబాద్ కేసరి రెజ్లింగ్ చాంపియన్‌షిప్'పోటీలు బార్కాస్ క్రీడా మైదానంలో జరుగనున్నాయి. 100–125 కేజీల విభాగంలో రుస్తుం-ఇ-హైదరాబాద్, 75–100 కేజీల విభాగంలో హైదరాబాద్ కేసరి, అండర్–19లో కుమార్ కేసరి, అండర్–17లో బాల కేసరి, అండర్–15లో మినీ బాల కేసరి.. కేటగిరీలలో 235 మంది పహిల్వాన్లు తలపడనున్నారు. హైదరాబాద్ జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసిషన్ ప్రతినిధులతో పాటు పేరుగాంచిన పహిల్వాన్లు ఈ పోటీలకు అతిథులుగా విచ్చేయనున్నారు.



2004లో ఆంధ్ర కేసరి టైటిల్‌తో ఖాలేద్ బామస్

ప్రాచీన కాలం నుంచి నేటి వరకు..

ప్రాచీన కాలం నుంచి నేటి వరకు మల్లయోధులకు ప్రజాదరణ ఎక్కువే. ఒకప్పటి మల్లయోధులనే ప్రస్తుతం 'పహిల్వాన్లు'గా పిలుస్తారు. పహిల్వాన్లకు శిక్షణ ఇచ్చేవారిని 'వస్తాద్'లు అంటారు. ఈ ప్రాంతంలో వీరికి శిక్షణ ఇచ్చే అకాడాలు(తాలీం) దాదాపు ఆరేడు ఉన్నాయి. ఐదేళ్ల వయస్సు నుంచి వీటిలో శిక్షణ పొందవచ్చు. ఈ అకాడాలలో శిక్షణ పొందిన వారు హైదరాబాద్‌లోనే కాకుండా ఢిల్లీ, మహారాష్ట్ర, సంగ్లీ, జంషెడ్‌పూర్, పంజాబ్, హరియాణా తదితర రాష్ట్రాల్లో నిర్వహించే కుస్తీ పోటీల్లో పాల్గొని బహుమతులను గెలుచుకున్నారు.

ఉదయం నాలుగున్నర గంటల నుంచే..

ఉదయం నాలుగున్నర గంటల నుంచే పహిల్వాన్లు వ్యాయామాన్ని ప్రారంభిస్తారు. ఈ వ్యాయామంలో ముఖ్యంగా డన్ బైటక్, సఫట్, తాడ్ ఎక్కడం, మట్టి తవ్వడం ముఖ్యమైనవి. డన్‌బైటక్ వ్యాయామం ద్వారా కాళ్లు, చేతులు బలంగా తయారవుతాయి. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో తమ స్థాయికి తగ్గట్టు పహిల్వాన్లు ఐదు వందల నుంచి వెయ్యి వరకు దన్‌బైటక్‌లను కొడుతారు. తాడు ఎక్కడం ద్వారా చేతికి పటుత్వం లభిస్తుంది. దంగల్‌లో మట్టిని తోడడం ద్వారా పక్కటెముకలు, వెన్నపూస, భుజాలు ధృడమవుతాయి.

ప్రత్యేకంగా దంగల్ ఏర్పాటు..

మల్లయోధుల వ్యాయామం కోసం ప్రత్యేకంగా దంగల్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ దంగల్‌లో ఎర్రమట్టిని వేసి ఆ మట్టిలో నెయ్యి, హారతి కార్పూరం, నిమ్మరసం, మంచినూనె, గంధం చెక్కల పొడర్ తదితర వాటిని కలిపి ఏర్పాటుచేస్తారు. ఈ మట్టిలో శిక్షణ పొందే సమయంలో గాయాలకు గురైనా..ఎలాంటి ప్రమాదం లేకుండా ఉండేలా తీర్చిదిద్దుతారు. శిక్షణ పొందే సమయంలో శరీరం నుంచి వెలువడే చెమట ద్వారా వాసన రాకుండా మట్టిలో కర్పూరం తదితరాలను వాడుతారు.

ఎంతో కష్టపడి ఆంధ్రకేసరి సాధించా..

12 ఏళ్ల పాటు కఠోర శిక్షణ తీసుకొని 2004లో ఎల్.బి స్టేడియంలో జరిగిన కుస్తీ పోటీల్లో ఆంధ్ర కేసరి అందుకున్నా. యువతను సన్మార్గంలో ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ప్రస్తుతం అకాడా నిర్వహిస్తూ యువకులకు శిక్షణనిస్తున్నా. మా అకాడా ఆధ్వర్యంలో ఈసారి 25వ హైదరాబాద్ కేసరి రెజ్లింగ్ చాంపియన్‌షిప్ నిర్వహించడం సంతోషంగా ఉంది. ఈ పోటీలకు యువత నుంచి మంచి స్పందన లభిస్తోంది. – ఖాలేద్ బామస్, చాంపియన్‌షిప్ నిర్వాహకుడు

క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి



ఎల్బీస్టేడియంలో కార్యక్రమానికి హాజరైన టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగ అభివృద్ధికి కృషి చేస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఎల్బీస్టేడియంలో క్రికెట్ ఫెడరేషన్ హైదరాబాద్ నిర్వహిస్తున్న 18వ రాజీవ్‌గాంధీ అండర్–19 టీ–20క్రికెట్ టోర్నమెంట్ గ్రాండ్ ఫినాలే మ్యాచ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకుకే ఇటీవల సీఎం కప్‌ను నిర్వహించినట్లు గుర్తు చేశారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించడమే కాక వారికి సరైన అవకాశాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. అంతకు ముందు మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ హైదరాబాద్ చైర్మన్ వి.హనుమంతరావు, శాసన సభ్యులు శంకరయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అభినందనలు



చార్మినార్: హైదరాబాద్ సిటీ పోలీస్ వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2024–2025లో దక్షిణ మండలానికి చెందిన పోలీస్ అధికారులు, సిబ్బంది వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచి గోల్డ్, సిల్వర్, కాంస్య పతకాలను సాధించారు. వీరందరినీ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తో పాటు దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా శుక్రవారం అభినందించారు. ప్రజలకు రక్షణగా ఉంటూ అనునిత్యం విధినిర్వహణలో క్షణం తీరిక లేకుండా ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది ఇలా వివిధ పోటీల్లో తమ ప్రతిభను కనబరచడం సంతోషకరమన్నారు.

రేపు ఆల్ ఇండియా రిపబ్లిక్ డే స్కూల్ చెస్ టోర్నీ

చార్మినార్: అండర్–16 బాల బాలికల కోసం ఈనెల 26న ఆల్ ఇండియా రిపబ్లిక్ డే స్కూల్ చెస్ టోర్నీ నిర్వహించనున్నట్లు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సంక్షేమ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సయ్యద్ అబ్దుల్ హై ఖాద్రీ తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని 26న మొగల్‌పురాలోని ఉర్దూ ఘర్‌లో నిర్వహించనున్నామన్నారు. సాయంత్రం 7 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో పార్టిసిపెంట్ సర్టిఫికెట్లు, విజేతలకు ప్రైజ్ మనీ, మెరిట్ సర్టిఫికెట్, మెడల్స్ అందజేయనున్నామన్నారు. దూర ప్రాంతాల నుంచి పాతబస్తీకి వచ్చే ఆటగాళ్లు, తల్లిదండ్రులు, వారి కోచ్ కోసం భోజన వసతి కల్పించనున్నామన్నారు. 1 జనవరి 2009 తర్వాత జన్మించిన వారు టోర్నమెంట్‌కు అర్హులని సొసైటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సయ్యద్ హై ఖాద్రీ తెలిపారు. వివరాలకు 85002 12306లో సంప్రదించవచ్చు.

ట్రాఫిక్ ఉల్లంఘనులపై కఠిన చర్యలు

చార్మినార్: ట్రాఫిక్ ఉల్లంఘనులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని చార్మినార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ స్పష్టం చేశారు. జాతీయ రహదారి భద్రతా మాసంలో భాగంగా బండ్లగూడ ఆర్టీఏ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్‌తో కలిసి ఆయన గుల్జార్‌హౌస్‌లోని ప్రభుత్వ నగర బాలికల ఉన్నత పాఠశాలలో ట్రాఫిక్ అవగాహనపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో చార్మినార్ ట్రాఫిక్ ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, ఏఎంవీఐలు అనిరుధ్, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల రిమాండ్

అబిడ్స్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని గుడిమల్కాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం..కిషన్‌బాగ్‌కు చెందిన ఆటోడ్రైవర్ రెహ్మాన్ (47), లింగంపల్లికి చెందిన బాలాజీ సంగ్రామ్ జాదవ్ (21)లు గంజాయి వ్యాపారం చేస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. అనుమానాస్పదంగా తిరుగుతున్న వీరిని రేతిబౌలి ప్రాంతంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయి, ద్విచక్ర వాహనాన్ని, రూ.5 వేల నగదు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్ తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్లూరి శివారెడ్డి సేవలు ప్రశంసనీయం



సుల్తాన్‌బజార్: డాక్టర్ ఎల్లూరి శివారెడ్డి ఉత్తమ పరిశోధకుడు, కవి విమర్శకుడని తెలుగు భాష సాహిత్య రంగాల వికాసానికి ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమని వక్తలు పేర్కొన్నారు. రసమై సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో డాక్టర్ ఎల్లూరి శివారెడ్డి రచించిన 'మనసు పూచిన పువ్వులు' కవిత సంపుటి ఆవిష్కరణ జరిగింది. తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శివారెడ్డి సురవరం ప్రతాప్‌రెడ్డి వాఙ్మయ కృషిని గురించి విశేషమైన పరిశోధన చేసి ప్రామాణికమైన గ్రంథం రచించారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అధ్యక్షోపన్యాసం చేస్తూ అధ్యాపకులుగా తాను రసాయన శాస్త్రంలో, శివారెడ్డి తెలుగు భాషా సాహిత్య శాఖలో పనిచేశామని తర్వాత ఆయన పర్యావేక్షణలో తాను పీహెచ్‌డీ పరిశోధన చేశానన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఓలేటి పార్వతీశం, డాక్టర్ మర్రి వెంకట నర్సింహారెడ్డి, డాక్టర్ జె.చెన్నయ్య ప్రసంగించారు.

ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలి



వివరాలు వెల్లడిస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ఏఎంఎస్ విధానంతో వాటర్‌బోర్డు కాంట్రాక్టర్లు రోడ్డు పాలయ్యారని టీపీసీసీ ఓబీసీసెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ ఆరోపించారు. ఇందిరమ్మ రాజ్యం ప్రారంభమై రెండో సంవత్సరం గడుస్తున్నా బీఆర్‌ఎస్ ప్రభుత్వ విధానాన్ని ఇంకా వాటర్‌బోర్డు ఎండీ రద్దు చేయకపోవడం దారుణమన్నారు. శుక్రవారం చీఫ్ సెక్రటరీ శాంత కుమారి, ముఖ్యమంత్రి కార్యాలయంలో ఆయన వాటర్‌బోర్డులో జరుగుతున్న ఏఎంఎస్ విధానం ద్వారా జరుగుతున్న అవినీతి అక్రమాలపై మెమొరండాలు అందజేశారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉన్న ఓపెన్ టెండర్ విధానాన్ని ప్రవేశపెడితే కాంట్రాక్టర్లు బాగుపడతారన్నారు. ఎంతో మంది కాంట్రాక్టర్లకు అన్యాయం జరుగుతున్నా వాటర్‌బోర్డ్ ఎండీ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చీఫ్ సెక్రటరీలు కాంట్రాక్టర్లకు న్యాయం జరిగే విధంగా ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపెన్ టెండర్ విధానాన్ని ప్రవేశపెట్టాలని పోల్కం శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

వాహనదారులకు అవగాహన



రేతిబౌలి చౌరస్తాలో అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ అంజయ్య

లంగర్‌హౌస్: రెడ్ సిగ్నల్‌లో కచ్చితంగా వాహనాలు నిలపాలని, జంప్ చేసి ముందుకు వెళ్లి ప్రాణాలను ఆపదలో వేసుకోవద్దని లంగర్‌హౌస్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య సూచించారు. సిగ్నల్ జంపింగ్ వద్దు అంటూ వాహనదారుల్లో అవగాహన కల్పిస్తూ చైతన్య కార్యక్రమాలను శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రెడ్ లైట్‌లో వాహనాలను కేటాయించిన జీబ్రా లైన్ల వెనకవైపే నిలపాలన్నారు. సిగ్నల్ జంపింగ్ వల్ల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకొని ఎంతో మంది ప్రాణాలు కోల్పోగా, మరి కొందరు వికలాంగులు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సెకండ్ల పాటు సిగ్నల్ వద్ద ఆపి జీవిత విలువల్ని తెలుసుకొని ముందుకు వెళ్లాలన్నారు.

ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ చంద్రకుమార్, ఇన్‌స్పెక్టర్ శ్రీను నాయక్

చాంద్రాయణగుట్ట: రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని సౌత్ ఈస్ట్ ఏసీపీ వి.చంద్రకుమార్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా చాంద్రాయణగుట్ట చౌరస్తాలో శుక్రవారం చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో వీబీపీ పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ చంద్రకుమార్, ఇన్‌స్పెక్టర్ శ్రీనునాయక్‌తో కలిసి వాహనదారులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా వాహనదారులు సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. పాదచారులు కూడా రోడ్లు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్‌ను అనుసరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎన్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సినిమా హాళ్లలో రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలియజేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మన్నె శ్రీధర్, బల్వంత్‌రావు, కల్యాణ్

నాంపల్లి: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సినిమా హాళ్లలో భారత రాజ్యాంగంతో పాటుగా జాతీయ జెండా ప్రాముఖ్యతను తెలియజేసే విధంగా ఐదు నిమిషాల నిడివి కలిగిన లఘు చిత్రాలను ప్రదర్శింపజేయాలని, దేశం కోసం పోరాటం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను ఈ లఘు చిత్రాల ద్వారా యువతరానికి తెలియజేయాలని యాక్షన్ కమిటీ మాల చైర్మన్ మన్నె శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అలాగే గణతంత్ర దినోత్సవం రోజున నిర్వహించే వేడుకల్లో జాతీయ జెండాతో పాటుగా అంబేద్కర్ చిత్రపటాన్ని ప్రదర్శించడం తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. భారత రాజ్యాంగం అమలు జరిగి 76 ఏళ్ల పూర్తయిన సందర్భంగా రేడియో, పత్రికలు, మీడియా, సినిమా హాళ్లలో గణతంత్ర దినోత్సవం శుభాకాంక్షలు ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జైభీమ్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు పి.బల్వంత్ రావు, అంబేడ్కర్ సేన నేత కల్యాణ్, శాస్త్రి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తుర్రేబాజ్‌ఖాన్‌కు ఘన నివాళి



తుర్రేబాజ్‌ఖాన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

సుల్తాన్‌బజార్: జనం కోసం వీరమరణం పొందిన గొప్ప భారతీయ విప్లవకారుడు తుర్రేబాజ్ ఖాన్ అని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటీ నరసింహ కొనియాడారు. తుర్రేబాజ్‌ఖాన్ వర్ధంతి సందర్భంగా కోఠిలోని మొదటి స్వాతంత్ర యుద్ధ అమరుల స్మారక స్థూపం వద్ద సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈటీ నరసింహతో పాటు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్ బోస్, ప్రముఖ సామాజిక వేత్త కృష్ణ ప్రసాద్, కార్యదర్శి ఛాయాదేవి, యాదగిరి, స్టాలిన్, వెంకటేశం తదితరులు తుర్రేబాజ్‌ఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ..బ్రిటీష్‌వారికి, నిజాంకు వ్యతిరేకంగా పోరాడి బ్రిటీష్‌వారిచే ఉరితీయబడ్డ గొప్ప దేశభక్తుడని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, శ్రీనివాస్, మహ్మద్ సలీమ్, రాజ్‌కుమార్, జంగయ్య, ఇమ్రాన్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



సభ్యులను సన్మానిస్తున్న షాహిన్ ప్రధాన కార్యదర్శి జమీల నిషాత్

యాకుత్‌పురా: బాలికలు, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని షాహిన్ ఉమెన్స్ రిసోర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జమీల నిషాత్ సూచించారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం సుల్తాన్ షాహి బక్షీ బజార్‌లోని సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం లో నిర్వహించారు. ఈ సందర్భంగా షాహిన్ సంస్థలో పలు అంశంలో మహిళలు, బాలికలకు అవగాహన కల్పిస్తూ చేయూతనందిస్తున్న 10 మంది సభ్యులను ఘనంగా సన్మానించి మొమెంటో ప్రశంసాపత్రలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..సమాజంలో మహిళలు, బాలికల సమస్యపై పోరాటం చేస్తూ బాధితులు న్యాయం అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మౌలానా అబుల్ కలం జాతీయ ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థులు, డాక్టర్ ఇనా, షాహిన్ సభ్యులు షాహేద, సుల్తానా, అర్చన, పూజా,దేవకి, ఫర్హాన, అనితా పాల్గొన్నారు.

ఘనంగా డ్రైవర్స్ డే



ఫారూఖ్‌నగర్ డిపోలో..

చాంద్రాయణగుట్ట: డ్రైవర్స్ డే సందర్భంగా ఫారూఖ్‌నగర్, ఫలక్‌నుమా ఆర్టీసీ బస్సు డిపోలలో శుక్రవారం ఉత్తమ డ్రైవర్లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బండ్లగూడ ఆర్టీఏ ఎంవీఐ రవీందర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రమాదాలకు దూరంగా ఉన్న ముగ్గురు ఉత్తమ డ్రైవర్లకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డ్రైవర్లే ఆర్టీసీకి ప్రధాన ఉద్యోగులన్నారు. బస్సులో ఎక్కిన ప్రయాణికుడిని గమ్యస్థానానికి క్షేమంగా చేరవేయాల్సిన గురుతర బాధ్యత డ్రైవర్‌పై ఉంటుందన్నారు. అంతకుముందు విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫారూఖ్‌నగర్, ఫలక్‌నుమా డీఎంలు వేదవతి, ఎస్.రమేష్, అసిస్టెంట్ మేనేజర్ రాజయ్య, అసిస్టెంట్ ఇంజినీర్ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



మెహదీపట్నం బస్ డిపోలో..

మెహిదీపట్నంలో..

గోల్కొండ: మెహిదీపట్నంలోని డిపోలో జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం డ్రైవర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ బి.వి.కె.మూర్తి మాట్లాడుతూ..బస్సు నడిపే డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్లను సన్మానించారు. వారికి సర్టిఫికెట్లు అందించి సన్మానించారు. అంతకు ముందు పాఠశాల విద్యార్థులతో కలిసి ఆర్టీసీ సిబ్బంది అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సరస్వతీ, అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ రహమాన్, ఆఫీస్ సూపరింటెండెంట్ కొండల్‌రావు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఇద్దరు నిందితులకు 25 ఏళ్ల జైలు

చాంద్రాయణగుట్ట: ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండేళ్ల క్రితం జరిగిన పోక్సో కేసులో ఇద్దరు నిందితులకు న్యాయస్థానం శుక్రవారం 25 ఏళ్ల కఠిన కారాగార శిక్షను విధించింది. ఇన్‌స్పెక్టర్ కె.ఎస్.ప్రసాద్ వర్మ తెలిపిన వివరాల ప్రకారం..2023లో ఛత్రినాకకు చెందిన మేకల రాహుల్(21), ఎం.నితిన్(19), జి.దీక్షిత్(19), డి.మల్లేష్(18), ఎం.రాజ్ కుమార్(18)లు 2023లో పోక్సో కేసులో నిందితులుగా ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన నాంపల్లి 12వ సెషన్స్ పోక్సో జడ్జి టి.అనిత రాహుల్, నితిన్‌కు 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధించింది. దీక్షిత్, మల్లేష్‌కు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల కఠిన కారాగార శిక్షను విధిస్తూ తీర్పును వెలువరిచారు. బాధిత బాలికకు రూ.7 లక్షలు పరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేసినవారికి సర్టిఫికెట్లను అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: ఆల్ ఇండియా కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆ సంఘం అధ్యక్షుడు జగన్నాథ్ షిండే మెగా రక్తదాన శిబిరాన్ని శుక్రవారం కింగ్‌కోఠిలోని కెమిస్ట్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా సభ్యులు 75 వేల యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఈశులాల్ జైన్, కుమార్‌గౌడ్, సంజయ్‌కుమార్ జైన్, గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ సురేఖ, రమేష్‌కుమార్ బంగ్, లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ట్రస్టీ రిదేష్ జాగిర్దార్, మీనా, అల్కా చౌదరి తదితరులు పాల్గొన్నారు.